యుద్ధ మ్యూజియాల సందర్శనకు

ఒక్కటే టికెట్

- పాఠశాల విద్యార్థులకు భారీ రాయితీ
- నాలుగు మ్యూజియంల సందర్శనకు అవకాశం



మ్యూజియం లోపలి భాగం

ఏయూ క్యాంపస్ : పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచే విధంగా ఏకీకృత టికెట్ వ్యవస్థను అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. బీచ్ రోడ్డులో ఒకే ప్రాంతంలో ఉన్న కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, ఎదురుగా ఉన్న టీయూ – 142 యుద్ధ విమానం, సీ హారియర్ మ్యూజియం, యూహెచ్ 3 హెచ్ యుద్ధ హెలికాప్టర్‌ను ఒకే టికెట్‌పై సందర్శించే విధంగా నూతన టికెటింగ్ విధానం అందుబాటులోకి తీసుకొచ్చారు. విశాఖ నగరానికి అధికంగా ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. వీరు సాగర తీరంలో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతాలతోపాటు రక్షణ రంగానికి చెందిన ఈ నాలుగు ప్రదేశాలను తప్పనిసరిగా సందర్శిస్తున్నారు. సబ్‌మెరైన్, యుద్ధ విమానం, సీ హారియర్‌ల సందర్శనకు వేర్వేరుగా టికెట్లు తీసుకోవాల్సి రావడంతో పర్యాటకులు మూడు ప్రాంతాల వద్ద క్యూలో నిల్చుని టికెట్లు కొనుగోలు చేసి సందర్శించడానికి ఎక్కువ సమయం వృథా అవుతోంది. దీనిని పరిశీలించిన అధికారులు నూతన విధానం అమలులోకి తీసుకొచ్చారు. గతంలో ఉన్న మూడింటితోపాటు ఇటీవల ప్రారంభమైన హెలికాప్టర్ మ్యూజియంను సైతం దీనితో అనుసంధానం చేస్తూ నాలుగింటినీ సందర్శించడానికి ఒకే టికెట్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీంతో పర్యాటకులు ఒకే టికెట్‌పై నాలుగు మ్యూజియంలు సందర్శించడానికి ఆసక్తి చూపడంతోపాటు, టికెట్ ధరలో వెసులుబాటు కల్పించడంతో ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్నారు. అదే సమయంలో కేవలం ఒక్క ప్రాంతాన్ని మాత్రమే సందర్శించాలి అనుకునే వారికి సైతం ఆయా సందర్శనీయ ప్రాంతానికి అనుగుణంగా టికెట్లు విక్రయించే వెసులుబాటు కల్పించారు.



ప్రదర్శనకు ఉంచిన పరికరాలు

ఇవీ సందర్శన వేళలు...

సోమవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8.30 వరకు పర్యాటకులకు ప్రవేశం కల్పిస్తున్నారు. ఆదివారం సందర్శకుల సంఖ్య అధికంగా ఉంటుండడంతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8.30 వరకు ప్రవేశం కల్పిస్తున్నారు.

ఆహ్లాదకరంగా పరిసరాలు

మ్యూజియంల చుట్టూ పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నారు. వీటి నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. దీంతో పర్యాటకులు అధికంగా ఇక్కడ ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. అదే విధంగా పర్యాటకుల కోసం ప్రత్యేకంగా టాయిలెట్స్ సైతం ఇక్కడ నిర్మించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఇవి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయి.



దేశ వాయుసేన శక్తిని చాటేలా ప్రదర్శన



ఆహ్లాదకరంగా పచ్చదనంతో ప్రదేశాలు



సందర్శకుల కోసం ప్రత్యేకంగా టాయిలెట్స్

దేశ రక్షణ సత్తా చాటే విధంగా...

యువత, విద్యార్థులకు ప్రేరణ కలిగించే విధంగా ఈ మ్యూజియంల ప్రాంగణాలున్నాయి. భారత దేశ రక్షణ వ్యవస్థ పటిష్టతను చాటేలా వీటి ప్రాంగణాల్లో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వీటిని వీక్షించడంతో అక్కడ ఉన్న విమానాలు, హెలికాప్టర్లకు సంబంధించిన విశేషాలను తెలుసుకునే అవకాశం కలుగుతోంది. తద్వారా వారిలో దేశభక్తి, దేశ రక్షణ రంగాల్లోకి వెళ్లాలనే ఆలోచనలకు బీజం పడే అవకాశం కలుగుతోంది. విభిన్న సందర్భాల్లో ప్రదర్శనలో ఉంచిన యుద్ధ విమానం, హెలికాప్టర్లు సేవలు అందించిన విధానం కళ్లకు కట్టినట్లు చూపించే ప్రత్యేక ప్రదర్శన చిన్నారులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.



హెలికాప్టర్ వద్ద ఫొటోలు తీసుకుంటున్న సందర్శకులు

పెద్దలకు రూ.200... పిల్లలకు రూ.120



యూహెచ్ 3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం

యూహెచ్ 3హెచ్ యుద్ధ హెలికాప్టర్ మ్యూజియం సందర్శనకు పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.50, బృందంగా వచ్చే పాఠశాలల విద్యార్థులకు రూ.30, కెమెరాకు రూ.60, వీడియో కెమెరాకు రూ.220 ప్రవేశ రుసుముగా నిర్ణయించారు. కురుసుర సబ్ మెరైన్ మ్యూజియం, టీయూ – 142 యుద్ధ విమానం, సీ హారియర్ మ్యూజియంలను ఒక్కొక్కటిగా సందర్శించడానికి పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.40, బృందంగా వచ్చే పాఠశాలల విద్యార్థులకు రూ.20 చొప్పున ప్రవేశ రుసుము ఉంది. వీటికి అదనంగా యుద్ధ హెలికాప్టర్ కూడా చేరింది. దీని ప్రకారం పెద్దలు నాలుగూ సందర్శించడానికి రూ.310, పిల్లలకు రూ.170 చొప్పున అవుతుంది. ప్రస్తుతం అధికారులు కొత్తగా తీసుకొచ్చిన విధానంలో నాలుగు ప్రదేశాలను సందర్శించడానికి పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.120, బృందాలుగా వచ్చే పాఠశాలల విద్యార్థులకు కేవలం రూ.40, కెమెరాకు రూ.200, వీడియో కెమెరాకు రూ.500 చెల్లిస్తే సరిపోతుంది. దీంతో పర్యాటకులు ఆసక్తిగా నాలుగు మ్యూజియంలు సందర్శించడానికి ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి యువజనోత్సవాలు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23న 11 అంశాల్లో యువజనోత్సవాలు నిర్వహించడానికి అధికారులు నిర్ణయించారు. 22న వక్తృత్వ, వ్యాసరచన, వాద – ప్రతివాద, క్విజ్, రంగవల్లులు, చిత్రలేఖనం, నాటికల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. అదేవిధంగా 23న సోలో సాంగ్, గ్రూప్ సాంగ్, శాస్త్రీయ నృత్యం, జానపద బృంద నాట్యాల్లో పోటీలు నిర్వహిస్తారు. పోటీలకు ఏయూ అనుబంధ కళాశాలల జాతీయ సేవా పథక కార్యకర్తలందరూ అర్హులే. విజేతలకు జాతీయ సేవా పథక దినోత్సవమైన సెప్టెంబర్ 24న బహుమతులు అందజేస్తారు. అదే రోజు జాతీయ ఐక్యతను ప్రతిబింబించే జాతీయ సమైక్యతా ర్యాలీని కూడా నిర్వహిస్తారు. మొత్తం కార్యక్రమాలను జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

లలితపీఠంలో నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



కిర్లంపూడిలోని లలిత పీఠంలో అమ్మవారు

ఏయూ క్యాంపస్ : బీచ్‌రోడ్డులోని కిర్లంపూడి లేఅవుట్‌లో ఉన్న శ్రీలలిత పీఠంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి లక్ష్మణస్వామి తెలిపారు. అక్టోబర్ 10 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిత్యం చండీహోమం, నిత్యార్చనలు, శ్రీచక్ర పంచామృతాభిషేకం, సహస్ర కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ముందుగా ఆలయంలో వివరాలు నమోదు చేసుకుని పూజల్లో పాల్గొనవచ్చని తెలిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరుపుతామని తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ సూర్యప్రకాష్‌రావు

ఆరిలోవ : నగరంలో బోధిధర్మ యుద్ధ కళా క్షేత్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ పొందిన విద్యార్థులకు గ్రేడింగ్ సర్టిఫికెట్లు జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి తెన్నేటి పార్కులో ఆదివారం ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఎన్ఎల్‌యూ వీసీ సూర్యప్రకాష్‌రావు విద్యార్థులకు గ్రేడింగ్ వారీగా బ్లాక్ బెల్ట్, గ్రీన్ బెల్ట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ చిన్నతనం నుంచి ఆరోగ్యం కోసం శారీరక శ్రమ అవసరమన్నారు. మార్షల్ ఆర్ట్స్ తదితర వాటి వల్ల ఆరోగ్యంతోపాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు భోజనాలు



ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో పిల్లలకు భోజనాలు వడ్డిస్తున్న మాజీ మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో అనాథ పిల్లలకు మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆదివారం భోజనాలు ఏర్పాటు చేశారు. ఆశ్రమానికి ఆమె కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి పిల్లలకు భోజనాలు వడ్డించారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో నడుచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆశ్రమం స్వామీజీ ఆచార్య సామ్యానంద్ అవదూత మాజీ మేయర్ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

కాలభైరవ స్వామికి పూజలు

మద్దిలపాలెం : కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయ సముదాయంలోని కాలభైరవ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కాలభైరవ స్వామిని భక్తితో కొలిచారు. అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, బాలభాస్కర శర్మ, సుబ్రహ్మణ్యం పూజలు చేశారు.

మూడో రోజూ ఆరిలోవలో బడ్డీల తొలగింపు



తోటగరువు హైస్కూల్ రోడ్డులో తొలగించిన బడ్డీని లారీలో వేస్తున్న పొక్లెయిన్



బడ్డీ తొలగించడంతో మిగిలిన రేకులు, ఇనుప రాడ్లను తోపుడు బండిపై తీసుకెళ్తున్న బాధితులు

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలోని రోడ్ల పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలను జీవీఎంసీ అధికారులు, సిబ్బంది మూడు రోజులుగా తొలగిస్తున్నారు. ఆరిలోవ పోలీసుల బందోబస్తు మధ్య ఆదివారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రోడ్డులోని ఎర్నిదుర్గామాంబ ఆలయం నుంచి తోటగరువు కూడలి వరకు రోడ్డు పక్కన అక్రమంగా ఏర్పాటు చేసినట్లు గుర్తించిన బడ్డీలను తొలగించేశారు. పొక్లెయిన్‌లతో బడ్డీలను తొలగించి లారీల్లో ఎక్కించి బయటకు తరలించారు. కొందరు చిరు వ్యాపారులే నేరుగా వాటిని తొలగించుకుని రేకులు, ఇనుప రాడ్లను వేరేచోటకు తరలించి భద్రపరచుకుంటున్నారు. ఈ రోడ్డులో టీ దుకాణాలు, సెలూన్ షాప్‌లు, పాన్ షాపులు తొలగించారు. వీటితోపాటు తోటగరువులో శ్రీకృష్ణుడి గుడి నుంచి కూడలి వరకు పలువురు వారి షాపుల ముందు రోడ్డును ఆక్రమించి నిర్మించిన గచ్చులను పొక్లెయిన్‌లతో తొలగించారు. ఆదివారం ఈ ప్రాంతంలో సుమారు 40 వరకు బడ్డీలు తొలగించారు. శుక్ర, శనివారాల్లో ఆరిలోవ ప్రాంతంలో అంబేడ్కర్ కూడలి నుంచి అటు శ్రీకాంత్‌నగర్, ఇటు బాలాజీనగర్ వరకు 99 బడ్డీలు తొలగించారు. దీంతో జీవీఎంసీ అధికారుల తీరును చిరు వ్యాపారులు వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్నారు. బడ్డీల తొగింపును అడ్డుకుంటున్నారు. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు మాత్రం వారి పని వారు చేసుకుపోతుండడంతో ప్రభుత్వం, కూటమి పార్టీల నాయకులపై చిరు వ్యాపారుల్లో వ్యతిరేకత పెరుగుతోంది.

పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాల అభివృద్ధి



పూర్వ విద్యార్థుల జేఏసీ అధ్యక్షుడు హేమంత్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషిని ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు కొనియాడారు. కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ వారి అభిప్రాయాలు తెలిపారు. కళాశాలలో పేద విద్యార్థులను చదివించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. పూర్వ విద్యార్థుల జేఏసీ ద్వారా కళాశాల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థుల జేఏసీ అధ్యక్షుడు హేమంత్‌ను ప్రిన్సిపల్ విజయబాబు సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయ, కో ఆర్డినేటర్ జి.వి.ప్రతాప్, ప్రెసిడెంట్ ఎస్.హేమంత్ కుమార్, కార్యదర్శి పి.రామ్మోహన్ రెడ్డి, ట్రెజరర్ వెంకటరమణ, మెంబర్స్ లీలా ప్రసాద్, రత్నప్రభ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై అడ్డంగా నిలిపిన కారుతో ట్రాఫిక్ ఇబ్బందులు

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతం ప్రధాన రహదారి మధ్యలో ఓ వ్యక్తి నిలిపిన కారుతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. తోటగరువు, బాలాజీనగర్ నుంచి టి.ఐ.సి.పాయింట్, ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వరకు ప్రధాన రహదారి ఇరుకుగా ఉంది. ఈ రహదారిపై అంబేడ్కర్ నగర్‌లో టి.ఐ.సి.పాయింట్‌కు వెళ్లే మలుపు వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు మధ్యలో ఓ కారు నిలిపేశాడు. ఆయన ఎక్కడికి వెళ్లాడో ఎవరికీ తెలియలేదు. దీంతో కారు పక్కకు తీయడానికి వీలుపడలేదు. సరిగా మలుపు వద్ద కావడంతో అటుగా వెళ్లే ఆర్టీసీ సిటీ బస్‌లు మలుపు తిరగడానికి వీలుపడక ఆ కారు వెనుకే నిలిచిపోయాయి. సుమారు గంటకు పైగా బస్‌లు, ఆటోలు, తదితర వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. ఆఖరికి ఆర్టీసీ బస్ కండక్టర్ 100కు డయిల్ చేయడంతో పోలీసులు వచ్చి కారును పక్కకు జరిపించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కారు నిలిపిన వ్యక్తి మాత్రం అందుబాటులో లేకపోవడం విశేషం.



అంబేడ్కర్ నగర్‌లో రోడ్డుకు అడ్డంగా నిలిపిన కారు వెనుక నిలిచిపోయిన బస్సు

రైతుబజార్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను ఆదివారం జిల్లా మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ అపర్ణ ప్రసాద్, వైస్ ఛైర్మన్ వింకు మహంతి చంద్రశేఖర్, డైరెక్టర్లు తాతారావు, శోభ సందర్శించారు. ఈ సందర్భంగా రైతు బజార్‌లోని స్టాళ్ల వద్దకు వెళ్లి రైతుల సమస్యలు, సౌకర్యాల కల్పనను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు విలువైన సేవలు అందించాలని సూచించారు. రైతు బజార్‌లో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని అరికట్టడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రైతుబజార్ల పరిసరాలను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ విషయంలో రైతులు, వినియోగదారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీపీ రైతు బజార్ ఈవో కె.వరహాలు, సహాయకుడు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



రైతు బజార్‌లో మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్, డైరెక్టర్లు, తదితరులు

ఏపీఎస్ఈబీ కాలనీలో ఉత్సవాలకు ఏర్పాట్లు

మద్దిలపాలెం : ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎం.సింహాద్రి రాజు, ఛైర్మన్ కొండ్రు రామారావు పేర్కొన్నారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ ఉత్సవాల్లో రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, పూజలు నిర్వహిస్తామని తెలిపారు. 22న సాయంత్రం నాట్య కళారాశి వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, 23న విజయనగరం నండూరి కాశీ ప్రసాద్ వారిచే సంగీత విభావరి, 24న కొండ్రు రామారావు, రంగనాథ్, ఎల్.సూర్యనారాయణ, శ్రీదేవిచే అన్నమయ్య కీర్తనలు, 25న సుహాసిని బాల త్రిపుర సుందరి పూజ, 26న చండీయాగం, 27న సాయంత్రం శ్రీ వెంకట దుర్గా అన్నమాచార్య సంస్థ వారిచే కోలాటం, 28న సాయంత్రం స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ వారిచే నృత్య ప్రదర్శనలు, 29న సామూహిక కుంకుమ పూజలు, 30న సాయంత్రం సాహితీ రవళి శిష్యులచే కూచిపూడి నృత్య ప్రదర్శన, అక్టోబర్ ఒకటిన లలిత చంద్రశేఖర్ శిష్యులచే సంగీత విభావరి, రెండున మధ్యాహ్నం మూడు గంటలకు శమీ పూజ అనంతరం దుర్గాదేవి నిమజ్జనోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. 5న మధ్యాహ్నం డాక్టర్ సప్పా నరేష్ సౌజన్యంతో మహా అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి కె.సత్తిరాజు, బి.గురునాథరావు, రామరాజు, సి.సుజని, పి.జయప్రద, సావిత్రి, జి.మంజులరాణి, ఎస్.నాగేంద్ర కుమారి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి చిత్తశుద్ధితో పనిచేస్తాం



వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావుతో నాయకులు

మద్దిలపాలెం : వైఎస్సార్ సీపీ బలోపేతానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని ఆ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లంపల్లి రాజబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడపాటి విలియమ్స్ విక్టర్ జోసెఫ్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులతో వీరికి శనివారం కీలక పదవులు లభించాయి. ఈ సందర్భంగా సీతమ్మధారలోని తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో సమన్వయకర్త మొల్లి అప్పారావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీలో బాధ్యత గల పదవిలో మమ్మల్ని నియమించడానికి సహాయ సహకారాలు అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ చిత్తశుద్ధితో పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పేర్ల విజయచందర్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, 16వ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు మీసాల ప్రదీప్, శరగడం వేణుగోపాల్, నక్కాన కమల్, గేదెల చందు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి

బీచ్‌రోడ్డు : ప్రమాదవశాత్తు భవనం పైనుంచి జారి పడిన ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శివాజీపాలెంకు చెందిన సి.రాము (45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఏయూలో కన్వెన్షన్ సెంటర్ మరమ్మతుల పనికి వెళ్లాడు. అక్కడ భవనం పైనుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆహ్లాదం.. ఆకర్షణీయం

- ఎంవీపీ రైతుబజార్‌కు రంగుల అతిథులు
- ఆకట్టుకుంటున్న జిరాఫీ, ఊడల మర్రి, భూతం ఆకృతులు



చెట్లపై ఆకట్టుకుంటున్న ఆకృతులు







రైతుబజార్‌లో పలు రంగుల ఆకృతులు అద్దిన చెట్లు



ఎంవీపీ కాలనీ రైతు బజార్ సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని చేరువచేసింది. ఈ మోడల్ రైతుబజార్‌లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమివ్వడంతోపాటు చెట్లను ఆకర్షణీయమైన ఆకృతులతో తీర్చిదిద్దారు. ఇటీవల రాష్ట్ర రైతు బజార్ల సీఈవో ఎంవీపీ రైతు బజార్‌ను సందర్శించి మరింత ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. దీంతో బజార్‌లో ఉన్న పలు చెట్లను రంగులతో అలంకరించారు. వివిధ రకాల జంతువుల ఆకృతులను చెట్లకు అద్దడంతో బజార్ మరింత ఆహ్లాదకరంగా మారింది. పలు రకాల రంగులతో కూడిన డిజైన్లతోపాటు జిరాఫీ, ఊడల మర్రి భూతం వంటి ఆకృతులను పెయింటింగ్ కళాకారులు వినూత్నంగా తీర్చిదిద్దారు. దీంతో బజార్ పరిసరాలు వినియోగదారులను ఆకట్టుకోవడంతోపాటు రైతులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. – ఎంవీపీ కాలనీ

డాక్టర్ సక్సేనా సేవలు ప్రశంసనీయం



డాక్టర్ సక్సేనా జయంతి సభలో మాట్లాడుతున్న డాక్టర్ నరేంద్ర నాథ్

మహారాణిపేట: వైద్య రంగానికి డాక్టర్ సక్సేనా అందించిన సేవలు మరువలేనివని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేంద్రనాథ్ అన్నారు. ఆదివారం ఆంధ్రా యూనివర్సిటీ ఎస్ఎస్ఎస్ భవన్‌లో జరిగిన పద్మశ్రీ డాక్టర్ కె.జి.సక్సేనా జయంతి సందర్భంగా హోమియోపతీ వికాస్ దివస్ పేరిట జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ సక్సేనా చిత్రపటానికి డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్ పుష్పమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. స్టేట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ సతీష్ కేక్ కట్ చేశారు. డాక్టర్ బి.వెంకటేశ్వరరావు డాక్టర్ సక్సేనా జీవిత విశేషాలు తెలిపారు. ప్రారంభ సభను విశాఖ అధ్యక్షుడు డాక్టర్ రాఘవేంద్రరావు నిర్వహించారు. నిరంతర వైద్య విద్యా కన్వీనర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, ప్రొఫెసర్ డాక్టర్ సనపల ఆనందరావు, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ వాకా సునీత, డాక్టర్ శివకాంతి, డాక్టర్ రాజా శ్రీకాంత్ పాల్గొన్నారు.

గిరిజన భవన్‌లో ప్రాంతీయ సంవాద్



కార్యక్రమంలో టాటా స్టీల్ ఫౌండేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు

ఎంవీపీ కాలనీ : అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రాంతీయ సంవాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన ఉద్యోగులు, విద్యార్థులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి కటారి శోభన్‌కుమార్ మాట్లాడుతూ ట్రైబల్ ఐడెంటిటీ, కల్చర్, డవలప్‌మెంట్ అంశాలను దేశవ్యాప్తంగా స్టడీ చేసేందుకు టాటా స్టీల్ ఫౌండేషన్ సంవాద్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా ఆ సంస్థ ప్రతినిధులు అంకిత టోప్పో, జేమ్స్ వింజ్, క్రాంతి కిరణ్ దొర, వెంకటరాజా ఆధ్వర్యంలో విశాఖ, అల్లూరి జిల్లాలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులతో ప్రాంతీయ సంవాద్ నిర్వహించినట్లు తెలిపారు. గిరిజనుల అభివృద్ధి, నైపుణ్యాల పెంపునకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు.